ARK MEDIA
SUBSCRIBE

TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల ఆనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 265 | శుక్రవారం, అక్టోబర్ 16, 2026 | పేజీలు : 04 | వెల రూ. 2.00/

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# ఎల్‌నినోతో నీటి సంక్షోభం తప్పదు!

**రాబోయే ఎనిమిది నెలలు అత్యంత కీలకం**
**జలాశయాల్లో నీటి నిల్వలు 209 టీఎంసీలకే పరిమితం**
**యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు వేయాలి**
**విద్యుత్ డిమాండ్ పెరుగుదలపై సీఎం ఆందోళన**
**సంక్షోభ నివారణకు కేంద్రం సహకరించాలి**

**నేటి ప్రభాత దర్శిని (హైదరాబాద్):**

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రం రానున్న రోజుల్లో తీవ్ర నీటి, విద్యుత్ కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎల్‌నినో పరిస్థితులపై శాస్త్రవేత్తలు చేసిన అంచనాలకు అనుగుణంగా సంక్షోభం ముదురుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ఏడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని జలాశయాల్లో 400 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం 209 టీఎంసీలకు పరిమితమయ్యాయని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, తాగునీటి అవసరాలకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమైనందున ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఒక సీజన్ పాటు వరి సాగును వాయిదా వేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం అసాధారణ స్థాయికి చేరిందని సీఎం పేర్కొన్నారు. సాధారణ డిమాండ్‌కు అదనంగా మరో 5,000 మెగావాట్ల విద్యుత్ అవసరం ఏర్పడుతోందని వివరించారు. మార్కెట్‌లో ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని, అదనపు విద్యుత్ కేటాయింపుల కోసం కేంద్రాన్ని ఇప్పటికే కోరామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని, కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్రం వాటాను పెంచాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ సస్పెన్షన్

**విధుల్లో నిర్లక్ష్యమే కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు**
**విద్యుదుత్పత్తి పెంపులో పర్యవేక్షణ లోపాలపై చర్యలు**
**విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి**
**రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశం**
**ఉన్నతాధికారులకూ చర్యలు తప్పవని హెచ్చరిక**

**నేటి ప్రభాత దర్శిని, (హైదరాబాద్):**

తెలంగాణలో విద్యుత్ కోతలు, విద్యుదుత్పత్తి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. విద్యుదుత్పత్తిని పెంచేందుకు చేపట్టాల్సిన పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు కథనం వెల్లడించింది. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది.



బుధవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా జరుగుతున్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్. హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్లు కథనం పేర్కొంది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు కోతలు లేకుండా చూడాలని, రానున్న 20 రోజులు పంటలకు కీలకమని స్పష్టం చేశారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని సూచించారు. లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సమీక్షించిన సీఎం, పలుమార్లు ఆదేశించినా సరఫరా పరిస్థితుల్లో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేసినట్లు సమాచారం.

# సింగరేణి ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు

**ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణలను ఖండించిన శ్రీధర్‌బాబు**
**కార్మికులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**
**బీఆర్ఎస్ పాలనలో భారీగా బకాయిలు పెట్టారని విమర్శ**
**సింగరేణి ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**
**యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తాం**

3

# కూరగాయలు కొంటూ కుప్పకూలి వ్యక్తి మృతి

**సూర్యాపేట జిల్లాలో విషాద ఘటన**
**మార్కెట్‌లో ఒక్కసారిగా అస్వస్థత**
**ప్రాణాలు కాపాడేందుకు స్థానికుల సీపీఆర్**
**ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి**
**సీసీ కెమెరాల్లో రికార్డైన ఘటన**

**నేటి ప్రభాత దర్శిని, (సూర్యాపేట):**

కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లాలో విషాదాన్ని నింపింది. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన బెజవాడ శ్రీనివాస్ స్థానిక మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురై బండి కింద పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అతడిని బయటకు తీసి, ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ చేశారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ శ్రీనివాస్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటు కారణంగా ఆయన మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటన మొత్తం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది.



# ‘మనం చేసి చూపిద్దాం’.. క్రీడాకారులకు మోదీ పిలుపు

**ఆసియా క్రీడల విజేతలతో ప్రధాని ప్రత్యేక భేటీ**
**భారత్‌ను అంతర్జాతీయ క్రీడా శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
**మహిళా క్రీడాకారుల విజయాలపై ప్రశంసలు**
**మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.36 వేల కోట్లు**
**2028 ఒలింపిక్స్ లక్ష్యంగా అథ్లెట్లకు ప్రోత్సాహం**



**నేటి ప్రభాత దర్శిని, (న్యూఢిల్లీ):**

భారతదేశాన్ని అంతర్జాతీయ క్రీడారంగంలో బలమైన శక్తిగా తీర్చిదిద్దుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆసియా క్రీడలు--2026లో ప్రతిభ కనబరిచి దేశానికి పతకాలు సాధించిన భారత క్రీడాకారులతో గురువారం ప్రత్యేకంగా సమావేశమైన ఆయన, ‘మనం చేసి చూపిద్దాం’ అనే నినాదంతో వారిలో స్ఫూర్తి నింపారు. క్రీడాకారులు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పారని ప్రశంసించారు. వారి విజయాల వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యుల కృషి కూడా ఉందని గుర్తుచేశారు. మహిళల హాకీ జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించి స్వర్ణం సాధించడం, పురుషుల హాకీ జట్టు పసిడి పతకం గెలుచుకోవడం, క్రికెట్, కబడ్డీలో భారత్ స్వర్ణాలు సాధించడం వంటి విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు సహా షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో క్రీడాకారుల ప్రదర్శనను అభినందించారు. భారత్ సాధించిన 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి 38 పతకాలు సాధించడం మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లోనూ భారత అథ్లెట్లు పతకాలు సాధించడం హర్షణీయమన్నారు. గత దశాబ్ద కాలంగా క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించిన మోదీ, ‘టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్’ (టాప్స్), ‘ఖేలో ఇండియా’ పథకాల ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియాలు, ఈత కొలనుల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు టాప్స్ కింద నెలకు రూ.50 వేల వరకు ఆర్థిక ప్రోత్సాహంతో పాటు విదేశాల్లో శిక్షణకు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్, 2030 కామన్వెల్త్ క్రీడల్లో రాణించడంతో పాటు, 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు విస్తృతంగా ప్రతిభాన్వేషణ కార్యక్రమాలు చేపడతామని, క్రీడాకారులు తమ పాఠశాలలు, గ్రామాలకు వెళ్లి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని పిలుపునిచ్చారు. ‘ఆడేవాడే ఎదుగుతాడు’ అనే సూత్రాన్ని ప్రస్తావిస్తూ, వికసిత భారత్ నిర్మాణంలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని మోదీ పేర్కొన్నారు.

# భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య

**నారాయణపేట జిల్లాలో దారుణ ఘటన**
**వివాహేతర సంబంధం విషయంలో దంపతుల మధ్య విభేదాలు**
**నిద్రిస్తున్న సమయంలో భర్తపై దాడి**
**చికిత్స పొందుతూ బాలస్వామి మృతి**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**నేటి ప్రభాత దర్శిని, (నారాయణపేట):**

తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలం మద్వార్ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో భార్య అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భర్త బాలస్వామి (46) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలస్వామి, రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో సంబంధం కొనసాగిస్తున్నాడనే విషయం తెలుసుకున్న రాములమ్మ పలుమార్లు అతడిని నిలదీసినట్లు సమాచారం. ఈ క్రమంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను అతడిపై పోసి నిప్పంటించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలతో బాధపడుతున్న బాలస్వామిని స్థానికులు తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న మృతి చెందాడు. ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడు ఇచ్చిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా రాములమ్మను విచారించినట్లు తెలిపారు. విచారణలో ఆమె నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో కాంగ్రెస్ అక్రమాలు

**అర్హులకే ఇవ్వాలని బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల డిమాండ్**

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని మైనార్టీ స్మశాన వాటిక ముందున్న ఖాళీ స్థలంలో కేటాయించబోయే డబుల్ బెడ్రూమ్ ప్లాట్ల కేటాయింపులో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర అక్రమాలకు పాల్పడుతున్నారని బోర్లం గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. బుధవారం బోర్లం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ నాయకుల పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు తమ అనుచరులకు, పార్టీ కార్యకర్తలకే ప్లాట్లు దక్కేలా లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నరకం అనుభవిస్తున్న అర్హులైన నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయని, వారిని పక్కనబెట్టి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇలా చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.



**బీ ఆ ర్ ఎ స్ డిమాండ్లు:**

ఇల్లు లేని నిజమైన నిరుపేదలను గుర్తించి వారికే ఇళ్లు కేటాయించాలి. కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి. ప్రభుత్వ అధికారులు గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారుల జాబితాను బహిరంగంగా ప్రకటించాలి. రాజకీయ బలంతో అర్హుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, నిరుపేదలకు న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మన్నే అనిల్, మమ్మాయి లక్ష్మణ్, బండమీది గంగాధర్, దొంతుల గంగారం, దొంతుల రాజ్ కుమార్, ఎర్రోళ్ల సాయిలు, బేగరి రాజు తదితర కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు..!

**రూ.8 వేల లంచం తీసుకుంటూ తహసీల్దార్, భూభారతి ఆపరేటర్ పట్టివేత.**

**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల . అక్టోబర్ 15 :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన దాడుల్లో వేములవాడ రూరల్ తహసీల్దార్ అబూబాకర్, భూభారతి ఆపరేటర్ సంకసాల అనిల్ పట్టుబడ్డారు. ఓ బాధితుడి భూ సంబంధిత పనిని పూర్తి చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్ని చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆపరేటర్ అనిల్ బాధితుడి నుంచి రూ.8 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.

**దరఖాస్తును పెండింగ్‌లో పెట్టి లంచం డిమాండ్?**

ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు తన భూ సంబంధిత పని నిమిత్తం గత సెప్టెంబర్‌లో స్లాట్ బుక్ చేసుకుని వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. అయితే వివిధ కారణాలు చూపుతూ ఆయన దరఖాస్తును తిరస్కరించి, పనిని పెండింగ్‌లో పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ పనిని పూర్తి చేయాలంటే రూ.10 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే తన వద్ద అంత మొత్తం లేదని, రూ.8 వేలు మాత్రమే సమకూర్చగలనని బాధితుడు చెప్పినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

**బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ.**

లంచం డిమాండ్ వ్యవహారంపై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన అధికారులు పక్కా వ్యూహంతో వలపన్నారు. ఇందులో భాగంగా తహసీల్దార్ అబూబాకర్ ఆదేశాల మేరకు భూభారతి ఆపరేటర్ సంకసాల అనిల్ బాధితుడి నుంచి రూ.8 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై మరోసారి చర్చ**

ప్రజలు తమ భూ సమస్యలు, ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాలను ఆశ్రయించినప్పుడు నిబంధనల ప్రకారం సేవలు అందించాల్సిన అధికారులు, సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనతో వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## శ్రీ దుర్గా భవాని సవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజలు.

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు.**

**భక్తులకు అన్నప్రసాద వితరణ.**

**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 15:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి మండపం ఆవరణలో 150 మంది మహిళలు ఘనంగా భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆరవ వార్షికోత్సవం సందర్భంగా పురోహితులు బ్రహ్మశ్రీ రాచర్ల దయానంద్ శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా, గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో దుర్గాదేవి మండపం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాచర్ల బొప్పాపూర్ ఏఎంసి వైస్ చైర్మన్ నంది కిషన్ ఉమా దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదం అందించి సేవాభావాన్ని చాటుకున్నారు. గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి భావంతో కొనసాగుతున్నాయి. అమ్మవారిని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండాడి కృష్ణారెడ్డి సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి మాజీ జెడ్పిటిసి సభ్యులు ఒడ్నాల నరసయ్య, స్థానిక సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డి , సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్ది లక్ష్మారెడ్డి చెన్ని బాబు గుండాడి రాంరెడ్డి బండారి బాల్రెడ్డి మేగి నరసయ్య , ఉప సర్పంచ్ జజ్జరీ దేవేందర్ ముదిరాజ్ బిజెపి పార్టీ నాయకులు సందుపట్ల లక్ష్మారెడ్డి, వార్డు మెంబర్లు వివిధ పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు మొక్కులు చెల్లించుకున్నారు, శ్రీ దుర్గ భవాని సేవా సమితి ప్రతినిధులు వడ్నాల భాస్కర్, నంది నరేష్ జవాజి సంజీవ్ మీసం హరీష్ బాధ రమేష్ రాజిరెడ్డి సాయి, ప్రణయ్ దేవయ్య ల ఆధ్వర్యంలో కుంకుమ పూజ అన్నప్రసాద కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.



## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పోచారం

**నర్సింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో సందడి**





**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసంలో బాన్సువాడ పట్టణానికి చెందిన 31 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి అందజేశారు. అనంతరం బాన్సువాడ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి విద్యార్థినులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులతో బతుకమ్మా ఉత్సవాలలో పాల్గొన్నారు. ప్రకృతిలో లభించే తంగేడు, గునుక బంతి పూలతో వారు తయారుచేసిన బతుకమ్మలను చూసి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఆగ్రోస్ మాజీ చైర్మన్ కాసుల బాలరాజు,బాన్సువాడ పట్టణ, గ్రామీణ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రాయన గుట్ట నియోజకవర్గం సమస్యలు నా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరింప చేస్తా, బోయ నాగేష్





**నేటి ప్రభాత దర్శిని! హైదరాబాద్ , చంద్రాయన గుట్ట !**

పాతబస్తీ చంద్రయనగుట్ట నియోజకవర్గం లోని అలియాబాద్ డివిజన్, లక్ష్మీ నగర్ ప్రాంతంలో గత ఆరు నెలల క్రితం డ్రైనేజ్ పైప్ లైన్ పనుల మరమ్మత్తుల కోసం జలమండలి అధికారులు రోడ్డు తవ్వి వదిలివేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చంద్రాయన గుట్ట నియోజకవర్గం ఇన్ ఛార్జ్ బోయ నాగేష్ దృష్టికి తీసుకు వెళ్లడంతో అతను వెంటనే స్పందించి, ప్రజలు ఇబ్బందులు పడే సమస్యలు తిలకించి అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ప్రజల యొక్క ఇబ్బందులను వెంటనే పరిష్కరింప చేయాలని కోరారు.

# ఓటర్ నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**బాన్సాడ ఆర్డిఓ రవీందర్ రెడ్డి**



**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

ప్రతి ఒక్కరు ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాన్ని సద్విని చేసుకోవాలని బాన్సువాడ ఆర్డిఓ రవీందర్ రెడ్డి అన్నారు .ఈనెల 15, 16 తేదీల్లో ప్రతి గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని , అక్టోబర్ 1,2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు,18 సంవత్సరాలు నిండి ఓటుహక్కు లేని వారు తప్పకుండా ఫామ్ 6 తమ పేరును నమోదు చేసుకోవాలని ఆర్డిఓ సూచించారు. బీర్కూర్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని ఆర్డిఓ రవీందర్ రెడ్డి తెలిపారు. ఫామ్ 8 లో ఓటర్ కార్డులో ఏదైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట బీర్కూర్ తహసిల్దార్ సవాయిసింగ్, గ్రామ సర్పంచ్ ధర్మ తేజ, గ్రామ కార్యదర్శి గంగారం పాల్గొన్నారు.

# ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్త!

**నేటి ప్రభాత దర్శిని! హైదరాబాద్, చంద్రాయన గుట్ట!**




ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా పండుగకు స్వగ్రామానికి వెళ్లే ప్రజలు తమ ఇంట్లోని విలువైన వస్తువులు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని ఛత్రినాక ఇన్ స్పెక్టర్, ఎస్, కోటేశ్వరరావు. తెలిపారు. ఈ సందర్భంగా ఛత్రినాక ఇన్ స్పెక్టర్,కోటేశ్వరరావుమాట్లాడుతూ: ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచడం. ఇంటిముందు గదిలో లైట్ వేసి ఉంచాలి.మరియు బయట గేటుకు. తలపులకు లోపలి నుంచి తాళాలు వేయాలని అన్నారు. మరియు పేపర్ బాయ్. పాల వారికి రావద్దని చెప్పాలన్నారు. ఊరికి వెళ్లే ముందు నమ్మకమైన వారికి స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని కోరారు.

# గుర్తింపు కార్డులు లేకుండా అద్దెకు ఇళ్లిస్తే చర్యలు తప్పవు!





**ఇంటి యజమానులకు డీఎస్పీ నాగేంద్రాచారి హెచ్చరిక.**

**అద్దెదారుల వివరాలు పోలీసులకు అందించాలి..**

**అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలి.**

**(నేటి ప్రబాత దర్శిని ప్రతినిధి) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 15 :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇంటి యజమానులకు పోలీసులు కీలక హెచ్చరిక జారీ చేశారు. అద్దెకు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలు, సరైన గుర్తింపు కార్డులు సేకరించిన తర్వాతే ఇళ్లు, గదులు అద్దెకు ఇవ్వాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రాచారి స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగేంద్రాచారి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చి అద్దెకు నివాసం ఉండేవారి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అద్దెకు దిగే వ్యక్తుల ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలను పరిశీలించి, వారి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అద్దెదారుల వివరాలను ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్‌కు అందించి, అవసరమైన పోలీసు ధ్రువీకరణ ప్రక్రియను పూర్తిచేసిన తర్వాతే గదులు కేటాయించాలని పేర్కొన్నారు. కేవలం పరిచయం ఉందనో, తక్కువ అద్దె వస్తుందనో వివరాలు తెలుసుకోకుండా ఎవరికి పడితే వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వడం సరికాదన్నారు.

**నేరాల నియంత్రణలో ఇంటి యజమానులదీ కీలక పాత్ర.**

గుర్తింపు వివరాలు సేకరించకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా అద్దెకు ఇళ్లు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని డీఎస్పీ హెచ్చరించారు. అద్దెదారుల వివరాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామంలో లేదా మండల కేంద్రంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించినా, వారి ప్రవర్తనపై అనుమానాలు కలిగినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో నేరాలను అరికట్టడం, ప్రజలకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ నాగేంద్రాచారి సూచించారు. ముఖ్యంగా ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరిస్తే నేరాల నియంత్రణకు మరింత అవకాశం ఉంటుందని తెలిపారు.

# విద్యాశాఖకు గీతానగర్ పాఠశాల ఒకేషనల్ గదులు అప్పగించాలి

**కేజీబీవీలో రాత్రి విధులు నిర్వహించిన వారికి ఉదయమే రిలీవ్ చేయాలి**

**విద్యార్థుల బోధనకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలి**

**డీఈవో విజయ్‌సాగర్‌కు టీపీటీఎఫ్ ప్రతినిధుల వినతి**

**శిక్షణలు, సమావేశాలకు ప్రత్యేక భవనం అవసరం**

**జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి**

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 15(నేటి ప్రభాత దర్శిని) :**

తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) విజయ్‌సాగర్‌కు స్వాగతం పలికి, విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానంగా రెండు సమస్యలను డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) రాత్రిపూట విధులు నిర్వహించే సిబ్బంది మరుసటి రోజు కూడా మధ్యాహ్నం వరకు విధుల్లో కొనసాగాల్సి వస్తోందని, దీనివల్ల వారు ఆరోగ్యపరంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు తెలిపారు. రాత్రి విధులు నిర్వహించిన వారిని మరుసటి రోజు ఉదయమే విధుల నుంచి రిలీవ్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, గీతానగర్ ఉన్నత పాఠశాలలో విద్యా సంబంధిత శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల బోధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో తరచూ శిక్షణలు, సమావేశాలు నిర్వహించడం వల్ల బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. జిల్లా ఏర్పాటు సమయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయంగా ఉపయోగించిన పాఠశాలలోని ఒకేషనల్ గదులను, ప్రస్తుతం ఎస్పీ కార్యాలయం కలెక్టరేట్ సమీపంలోని నూతన భవనంలోకి మారినందున, తిరిగి విద్యాశాఖకు అప్పగించాలని కోరారు. ఆ గదులను విద్యాశాఖ శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు, కాంప్లెక్స్ సమావేశాలతో పాటు గత సంవత్సరం జిల్లాకు కేటాయించిన పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రంగా కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని డీఈవోకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, జిల్లా బాధ్యులు మందాడి శ్రీనివాస్‌రెడ్డి, మైలారం తిరుపతి, బండి ఉపేందర్ పాల్గొన్నారు.



# సింగరేణి ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు

**ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణలను ఖండించిన శ్రీధర్‌బాబు**

**కార్మికులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**బీఆర్ఎస్ పాలనలో భారీగా బకాయిలు పెట్టారని విమర్శ**

**సింగరేణి ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

**యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తాం**

**నేటి ప్రభాత దర్శిని, (హైదరాబాద్):**

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణికి భారీగా బకాయిలు పేరుకుపోయాయని, సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆరోపించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని విమర్శించారు. సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు, ప్రజలు ఇలాంటి విమర్శలను పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆధారాలు లేని ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరించారు.



# 14 గంటల్లోనే పవన్ సింగ్ హత్య కేసు ఛేదించిన పోలీసులు.

**టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్.**

**డబ్బుల కోసమే హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి.. రైల్వే స్టేషన్‌లో పట్టుకుని రిమాండ్‌కు తరలింపు.**

**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 15 :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో సంచలనం సృష్టించిన టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య కేసును పోలీసులు కేవలం 14 గంటల్లోనే ఛేదించారు, డబ్బుల కోసం తమతో కలిసి పనిచేస్తున్న టైల్స్ పనుల కూలీలు మృతునికి వరుసకు బావమరిది అయిన రాజస్థాన్ కు చెందిన జోగిందర్ ఉత్తరఖండ్ కు చెందిన శివం ఆగ్రా ఉత్తర ప్రదేశ్ కు చెందిన టైల్స్ కాంట్రాక్టర్ పవన్ ను (28 ) ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో 14వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో మెడపై గొంతు పై కోసి చాతి పై పొడిచి హత్య చేసి తలుపులు పెట్టి పవన్ కు చెందిన ద్విచక్ర వాహనంపై పరారైనట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా పేర్కొంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జోగిందర్, శివమ్‌లను వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ ప్రత్యేక పోలీసు బృందం రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసింది. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మీడియా సమావేశం.**

గురువారం ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ కత్తురోజు నాగేంద్రచారి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గొల్లపల్లి గ్రామంలో జరిగిన ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. సీఐ ఓ. వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులు పరారైన మార్గాలు, అందుబాటులో ఉన్న ఆధారాలపై దృష్టి సారించారు.

**టైల్స్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య.**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పవన్ సింగ్ టైల్స్ వర్క్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు టైల్స్ బిగించే పనులు చేపడుతూ, తన రాష్ట్రానికి చెందిన ఇతర కూలీలను కూడా పనుల నిమిత్తం తీసుకువచ్చేవాడని తెలిసింది. ఈ క్రమంలో గొల్లపల్లి గ్రామంలో పనులు నిర్వహిస్తున్న సమయంలో పవన్ సింగ్ హత్యకు గురయ్యాడు. గొల్లపల్లిలోని శాతవాహన కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన భవనానికి సంబంధించిన గదిలో ఈ ఘటన వెలుగుచూసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి, హత్య జరిగిన గది, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో కీలక ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు.

**డబ్బుల కోసమే హత్య చేసినట్లు వెల్లడి.**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. పవన్ సింగ్‌తో కలిసి పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు జోగిందర్, శివమ్ డబ్బుల కోసం ఈ హత్యకు పాల్పడినట్లు వెల్లడైంది. హత్య అనంతరం అక్కడి నుంచి పరారైన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసును సవాలుగా తీసుకున్న సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం సాంకేతిక, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ క్రమంలో పరారీలో ఉన్న జోగిందర్, శివమ్‌లను రైల్వే స్టేషన్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి, చట్టపరమైన ప్రక్రియ పూర్తిచేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి మీడియాకు వివరించారు.

**పోలీసు బృందానికి డీఎస్పీ అభినందనలు.**

హత్య జరిగిన కొద్ది గంటల్లోనే దర్యాప్తును వేగవంతం చేసి, 12 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ నాగేంద్రచారి అభినందించారు. ఈ కేసులో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందించేందుకు సిఫారసు చేస్తానని తెలిపారు. గొల్లపల్లిలో టైల్స్ వర్క్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ హత్య స్థానికంగా కలకలం రేపగా, పోలీసులు వేగంగా స్పందించి నిందితులను పట్టుకోవడంతో కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. మీడియా సమావేశంలో ఎల్లారెడ్డి పేట సి ఐ ఓ.వెంకటేష్,ఎల్లారెడ్డి పేట ఎస్ ఐ ఎన్.రమేష్ గౌడ్,వీర్నపల్లి ఎస్ ఐ లక్ష్మణ్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

**ప్రకృతిలో లభించే పూలను పేర్చి దేవతగా పూజింపబడే బతుకమ్మ**

**ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**



**నేటి ప్రబాదదర్శిని ఆసిఫాబాద్ అక్టోబర్ 15,**

ప్రకృతిలో లభించే రంగురంగుల పూలను పేర్చి దేవతగా పూజింపబడే బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొమరం భీమ్ ప్రాజెక్టు ఒడ్డున జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలను జిల్లా ఎస్పీ నితి కా పంత్ జిల్లా అటవీ శాఖ అధికారి జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్ కాగజ్నగర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు లతో కలిసి గౌరమ్మను పూజించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలను ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన కొమరం భీమ్ ప్రాజెక్ట్ ఒడ్డున నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతం యొక్క విశిష్టతను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటి చెబుతుందని, మహిళల ఐక్యతకు, ప్రకృతి పట్ల ఆరాధనకు, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించాలని, సాంప్రదాయమైన పాటలు పాడుతూ, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం చాలా సంతోషకరమని తెలిపారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, ఐ కె పి సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు**
**రిజర్వాయర్ల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి**
**సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**
**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**నేటి ప్రభాతదర్శిని కరీంనగర్ అక్టోబర్ 15 :**

ఎల్‌నినో నేపథ్యంలో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, సమస్యలు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీలోని కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వివిధ శాఖల సన్నద్ధతపై చర్చించారు. ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, భూగర్భజల శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**రిజర్వాయర్ల నీటిమట్టాలపై నిరంతర పర్యవేక్షణ**

రిజర్వాయర్లలో నీటిమట్టాలను ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. నీటి లభ్యతపై నిరంతరం సమీక్షిస్తూ, సమస్యలు తలెత్తే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

**తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు**

రానున్న రోజుల్లో తాగునీటి అవసరాలు, నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు**

విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ అవసరాలు, నీటి సరఫరా వంటి కీలక అంశాలను దృష్టిలో ఉంచుకుని శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

ఎక్కడ సమస్య తలెత్తే అవకాశం ఉందో గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దాని అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**పక్కా ప్రణాళికలతో రావాలి**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన చర్యలపై వచ్చే గురువారం మరోసారి సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. అప్పటిలోగా ప్రతి శాఖ అధికారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని రావాలని ఆదేశించారు. సమస్యలను ముందుగానే గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు.

# సేవాలాల్ మహారాజ్ బంజారా భవన్ కు కృషి చేయాలి

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసిన బంజారా పెద్దలు**

**నేటి ప్రభాత దర్శిని పెగడపల్లి అక్టోబర్ 15**



జగిత్యాల జిల్లా బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జగిత్యాల మీరా డా. సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి జగిత్యాల జిల్లా కేంద్రం సేవాలాల్ మహారాజ్ ఆలయం జగద్ధంభా అమ్మవారి ఆలయానికి మరియు బంజారా భవన్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని మీరా ని కోరగా సానుకూలంగా స్పందించినారు అని సంఘం కమిటీ సభ్యులు తెలిపారు జగిత్యాల జిల్లా సేవాలాల్ సంఘం కమిటీ సభ్యులు మీరా సంజయ్ కుమార్ కి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు. భూక్యా నందు నాయక్, ఉప అధ్యక్షులు. నగావత్ బాలు నాయక్, బోద వెంకటేష్ నాయక్ తదితరులు మరియు జిల్లా జనరల్ సెక్రటరీలు. మాలోత్ లచ్య నాయక్, భూక్యా రవి నాయక్, మరియు జిల్లా బంజారా సంఘం కమిటీ సభ్యులు అంగోత్ రమేష్ నాయక్, లావుడ్య ప్రవీణ్ నాయక్, కోశాధికారి. భూక్యా ప్రవీణ్ నాయక్ మరియు జగిత్యాల జిల్లా బంజారా సంఘం గౌరవ పెద్దలు. భూక్యా జవహర్ నాయక్, నునవత్ రాంజీ నాయక్, భూక్యా గోపాల్ నాయక్ తదితరులు బంజారా సేవాలాల్ సంఘం కమటి సభ్యులు మరియు జగిత్యాల జిల్లా బంజారా పెద్దలు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి





**ఎస్‌జీటీ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలి: టీఆర్టీఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి**

**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 15 :**

నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె. విజయసాగర్‌ను టీఆర్టీఎఫ్ (౧=ఖీ) రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాధికారికి ప్రాతినిధ్య పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ మాట్లాడుతూ.. 2025 ఆగస్టులో స్కూల్ అసిస్టెంట్లుగా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందిన పలువురు ఉపాధ్యాయులు ఎస్‌జీటీ ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇప్పటికీ పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారని తెలిపారు. పదోన్నతులు పొంది నెలలు గడుస్తున్నా సంబంధిత ఉపాధ్యాయులను కొత్త పాఠశాలలకు రిలీవ్ చేయకపోవడంతో పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో 80కి పైగా ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ ఖాళీల కారణంగా విద్యార్థుల బోధనాభ్యసన ప్రక్రియకు ఆటంకం కలగకుండా, నిబంధనల ప్రకారం విద్యా వాలంటీర్లను నియమించి ఖాళీలను తాత్కాలికంగా భర్తీ చేయాలని కోరారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను వారి నూతన పాఠశాలలకు వెంటనే రిలీవ్ చేయడంతోపాటు, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. టీఆర్టీఎఫ్ నాయకులు సమర్పించిన ప్రాతినిధ్యంపై జిల్లా విద్యాధికారి జె. విజయసాగర్ సానుకూలంగా స్పందించారని, సంబంధిత పైఅధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతుగంటి రమేష్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు బూట్ల శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు గుగులోత్ రమేష్ నాయక్, టీఆర్టీఎఫ్ నాయకులు గోలి రాధాకిషన్, గాజంగి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారంపై కసరత్తు





**బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా**
**ప్రత్యామ్నాయ స్థలాల గుర్తింపుపై దృష్టి.. పొగ, కాలుష్య నివారణకు చర్యలు**

**నేటి ప్రభాత దర్శిని కరీంనగర్ అక్టోబర్ 15**

కరీంనగర్ బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపే దిశగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ డివిజనల్ అధికారి షర్మిలతో కలిసి గురువారం డంపింగ్ యార్డ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నివారణ చర్యలు చేపట్టడంతోపాటు, డంపింగ్ యార్డ్‌కు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించే అంశంపై అధికారులతో చర్చించారు.

**ప్రత్యామ్నాయ స్థలాల గుర్తింపుపై దృష్టి**

ప్రస్తుత డంపింగ్ యార్డ్‌కు బదులుగా మరోచోట ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రభుత్వ స్థలాలను పలు ప్రాంతాల్లో పరిశీలించారు. ప్రత్యామ్నాయ స్థలాల లభ్యత, అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలు, ఇతర అవసరమైన అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలాల వివరాలను సమగ్రంగా పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

**పొగ, కాలుష్య నివారణకు చర్యలు**

ప్రస్తుత డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న పొగ, కాలుష్యంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కలెక్టర్ ఆరా తీశారు. పొగ వ్యాప్తిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. డంపింగ్ యార్డ్ నిర్వహణలో తలెత్తుతున్న సమస్యలను తగ్గిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపే చర్యల్లో భాగంగా సీడీఎంఏ ఆధ్వర్యంలో స్వచ్ఛ మైనింగ్ ప్రక్రియతో పాటు ఇతర పనులపై చర్చించారు. చేపట్టనున్న పనులకు సంబంధించిన అంశాలను అధికారులతో సమీక్షించారు. ఈ పనుల ద్వారా ప్రస్తుత సమస్యలను తగ్గించడం, వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చించారు.

**శాశ్వత పరిష్కారమే లక్ష్యం**

డంపింగ్ యార్డ్ సమస్యకు తాత్కాలిక చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారం చూపడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక, కాలుష్య నియంత్రణ, ప్రతిపాదిత పనుల అమలుకు సంబంధించి అవసరమైన వివరాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తగ్గించేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సమ్మిళిత పథకాల సంపూర్ణ అమలు ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

**జిల్లా కలెక్టర్ కె. హైమావతి చేతుల మీదుగా ఆర్థిక సమ్మిళిత పథకాల సంపూర్ణ అమలు ప్రచార పోస్టర్ ఆవిష్కరణ**




**నేటి ప్రభాత దర్శిని సిద్ధిపేట, అక్టోబర్ 15**

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆర్థిక సమ్మిళిత పథకాల సంపూర్ణ అమలు ప్రచార కార్యక్రమం పోస్టర్‌ను సిద్ధిపేట జిల్లా కలెక్టర్ గౌరవనీయులు శ్రీమతి కె. హైమావతి ఆవిష్కరించారు. ఈ ప్రచార కార్యక్రమం 2026 అక్టోబర్ 21 నుండి డిసెంబర్ 31 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రజలకు వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాల ప్రయోజనాలను అందించడంతో పాటు, బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం ప్రధాన లక్ష్యంగా నిర్దేశించబడింది. ఈ ప్రచారంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు (ౡాలు), పట్టణ స్థానిక సంస్థలు (ఖాదీలు) పరిధిలో బ్యాంకుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన మరియు సేవా శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల ద్వారా ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (గ్రావీజీణ్), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (గ్రావీజీజీ-దీ), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (గ్రామీదీ), అటల్ పెన్షన్ యోజన (ఙూ) వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన లబ్ధిదారులకు పథకాలలో నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. అలాగే ఆధార్ సీడింగ్, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సేవలు మరియు ఇతర ఆర్థిక సమ్మిళిత సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రతి గ్రామ పంచాయతీ మరియు పట్టణ స్థానిక సంస్థ పరిధిలో కనీసం ఒక శిబిరం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. అన్ని బ్యాంకులు, బ్రాంచ్ మేనేజర్లు, బ్యాంక్ కరస్పాండెంట్లు (దీజలు), ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు (ఖీజలు), సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ (జఖీ) సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా బ్యాంకులు, సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ కార్యాలయం విజ్ఞప్తి చేసింది.